క్లుప్తంగా

క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలి



నారాయణపేట రూరల్: మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు దోహదం చేస్తాయని ఎస్ఎస్‌కే సమాజ్ జాతీయ ఉపాధ్యక్షుడు నాగురా వు నామాజీ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖత్రీ ప్రీమి యర్ లీగ్ క్రికెట్ పోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లా డుతూ యువకులు, విద్యార్థులు మొబైల్ ఫోన్లతో టైం పాస్ చేయకుండా క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎస్ కే సమాజ్ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రాంగణాలు నిర్మించాలి



కొత్తపల్లి: ఉమ్మడి కొత్తపల్లి, మద్దూరు మండలాల్లో ప్రయాణికుల కోసం ప్రాంగణాలు నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. రాష్ట్రంలో ఉచిత బస్సు పథకం అమలుతో బస్సుల్లో ప్రయాణించడానికి మహిళలు క్యూకడుతున్నారు. అయితే ప్రధాన రోడ్లపై ఎక్కడ కూడా ఎండ వేడిమికి తల దాచుకోవటానికి ఆర్టీసీ ప్రాంగణాలు కనిపించడం లేదు. అసలే ఎండా కాలం కావడంతో బస్సుల కోసం నిరీక్షించే క్రమంలో ప్రజలు వడదెబ్బకు గురవుతున్నారు. కావున మండలంలోని ప్రతి బస్‌స్టాప్ వద్ద ప్రయాణికుల కోసం ప్రాంగణాలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడాకారులకు దుస్తుల అందజేత



మాగనూర్(మక్తల్): మక్తల్ మండలంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు కర్ని గ్రామ లక్కీ యూత్ అసోసియేషన్ సభ్యులు క్రీడా దుస్తులను అందజేశారు. గత నెల 25 నుంచి ఖో-ఖో క్రీడలో ఉచిత శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో శిబిరంలో పా ల 50 మంది బాల బాలికలకు గురువా రం రూ.10వేలు విలువ చేసే దుస్తులను పంపిణీ చేశారు. గత 8 సంవత్సరాల నుంచి కర్ని పాఠశాలలో పిడి బి. రూప బాలబాలికలకు వివిధ క్రీడాల్లో మెరుగైన శిక్షణ ఇస్తూ విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడం అభినందనీయమని అసోసియేషన్ సభ్యులు తెలిపారు.

రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మద్దూరు: ఎన్నికల సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అఖిల భారత ఐక్య రైతు కూలీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయాలని రైతు కూలీ సంఘం అధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు మండలం నుంచి రైతు కూలీ సంఘం నాయకులు కొండనర్సింములు, సాయప్ప, కృష్ణయ్య, అంజి, భీములు, అంజప్ప తదితరులు గురువారం తరలివెళ్లారు.

సైబర్ నేరాలపై బాలికలకు అవగాహన

ఊట్కూరు: మండలంలోని పులిమామిడి ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపులో ఉన్న బాలికలకు గురువారం షీటీం పోలీసులు సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు క్రీడలు తదితర అంశాలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఎవరైన మానసికంగా, శారీరకంగా వేధిస్తే షీటీం పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో 100కు డయల్ చేసి సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలపై అవగాహన కలిపించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది జ్యోతి, కవిత పాల్గొన్నారు.

రైతులు ఏం పాపం చేశారు

- సంచులు లేవు, లారీలు లేవు
- డబ్బులు ఇచ్చినోళ్లకే వాహనాల సరఫరా



తీలేర్ సొసైటీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

మరికల్: అన్నదాతలు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం సరైన సౌకర్యాలు కల్పించడం లేదని మరికల్ రైతులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు గురువారం తీలేర్ సింగిల్ విండో సొసైటీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పంటలు కోత వేసి 15 రోజులు అవుతున్నా తమకు సంచులు పంపిణీ చేయడం లేదని లారీలు కూడా అందుబాటులో ఉంచలేదని విమర్శించారు. ప్రభుత్వం సరైన వసతులు కల్పించకపోవడంతో ధాన్యాన్ని రోడ్లపై, కల్లాల దగ్గర ఉంచాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీలేర్ సొసైటీకి ఇప్పటి వరకు 2.90 లక్షల గన్నీ బ్యాగులు వచ్చాయని అందులో సగం బొక్కలు పడ్డ సంచులే ఉండటంతో వాపస్ ఇచ్చామన్నారు. ఒకవేళ ధాన్యం సంచులకు నింపిన లారీలు అందుబాటులో ఉంచడం లేదన్నారు. ఇలా రోజుల తరబడి లారీల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. లారీ రావాలంటే రూ.2 వేల నుంచి రూ.5 వేలు ఇస్తేనే పంపిస్తామని కొనుగోలు సిబ్బంది వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. లారీ డ్రైవర్‌కు ఏ రైతు ఎక్కువ డబ్బులు ఇస్తే ఆ రైతుకే లారీ పంపిస్తున్నారని, ఇంత జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శిస్తున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులు ఏం పాపం చేశారని, తమను ఇలా వేధిస్తున్నారని కన్నీటిపర్యంతమవుతున్నారు.

రైతుల నుంచి డబ్బులు తీసుకోలేదు

కాంట్రాక్టర్ ఇప్పటి వరకు ఒక లారీని కూడా పంపించలేదు. ట్రాన్స్‌పోర్ట్ సమస్య తీవ్రంగా ఉండటంతో మిల్లర్లతో మాట్లాడి వారి లారీలు అందుబాటులో ఉంచి రైతుల నుంచి ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలిస్తున్నాం. రైతులతో డబ్బులు తీసుకొని లారీలు పంపిస్తున్నట్లు చేస్తున్న ఆరోపణలు అవాస్తవం.

– కృష్ణ, సీఈఓ, తీలేర్

ప్రతి ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి



ఆలయంలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ రాజేందర్‌రెడ్డి

మరికల్: ప్రతి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే చోరీలను నియంత్రించవచ్చని సీఐ రాజేందర్‌రెడ్డి అన్నారు. మరికల్‌లోని భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యులు, వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్ఐ రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవాలయం ఇరువైపులా 8 సీసీ కెమెరాలతో పాటు సీసీ పుటేజీ ఏర్పాటు చేయడం మంచి నిర్ణయమన్నారు. మండల కేంద్రంలోని మిగతా ఆలయాల్లో కూడా సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటే బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జగదీశ్, బసంత్, వీరన్న, శరత్‌బాబు, మల్లికార్జున్, తిప్పన్న, శివప్రసాద్, శేఖర్, బసన్న పాల్గొన్నారు.

ఐకేపీ సీసీకి రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం



మంత్రి సీతక్క చేతుల మీదుగా అవార్డు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రం క్లస్టర్ సీసీగా పని చేస్తున్న శోభకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ పురస్కారం లభించిందని ఏపీఎం రాంబాబు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన నలుగురు సీసీల్లో జిల్లా నుంచి శోభ ఒక్కరే ఎంపికై నట్లు చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో రాష్ట్ర మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యారాజన్ అవార్డును అందజేసినట్లు వివరించారు. దీన్‌దయాళ్ యోజన, జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకంలో భాగంగా ఈ అవార్డును అందజేస్తున్నట్లు తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో మహిళా సంఘాలకు అందించే రుణాల్లో శోభ తన క్లస్టర్ పరిధిలోని ఖిల్లాఘనపురం, వెంకటాంపల్లి, గట్టుకాడిపల్లి, ఆగారం, అంతాయపల్లి, షాపురం గ్రామాల్లోని మహిళా సంఘాలకు రూ.11.50 కోట్ల రుణాలు ఇప్పించినట్లు వివరించారు. ఈ సందర్భంగా శోభను ఐకేపీ సిబ్బంది, ఏపీఎంలు అభినందించారు.

వింత ఆవుదూడ జననం

- పొదుగుతో పుట్టి ఐదు రోజులకే పాలు ఇస్తున్న వైనం
- జన్యులోపంతో ఇలా జన్మిస్తాయంటున్న వైద్యులు



పాలు ఇస్తున్న ఆవు దూడతో రైతు, పశువైద్య సిబ్బంది

కోస్గి: నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన రైతు అర్జున్ తన ఆవుకు గోపాలమిత్ర మల్లేశ్‌తో కృత్రిమ గర్భధారణ చేయించారు. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితం ఆవు దూడ జన్మించింది. పుట్టినప్పుడే పొదుగు ఉండటంతో ఏదో వాపు ఉంటుందని రైతు పెద్దగా పట్టించుకోలేదు. గురువారం ఉదయం పొదుగు నుంచి సన్న ధారగా పాలు రావడంతో గోపాలమిత్రకు సమాచారం ఇచ్చారు. మండల పశువైద్యాధికారి శివనాయక్‌తో కలిసి అక్కడికి వెళ్లి పుట్టిన దూడ నుంచి పాలు తీయించారు. చాలా తక్కువ సందర్భాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతాయని, ఆవుదూడ ఆరోగ్యంగానే ఉందని చెప్పి వైద్యం చేశారు. జన్యు లోపంతో చాలా అరుదుగా ఇలాంటి దూడలు జన్మిస్తాయని పేర్కొన్నారు. పుట్టిన దూడ ఇచ్చిన పాలలో ఎలాంటి హార్మోన్లు, ఇతర పోషకాలు ఉండవని, ఆవుదూడ వయస్సు పెరిగిన కొద్ది వాపు తగ్గిపోతుందని, లేదా కొన్ని ఇంజెక్షన్లు ఇచ్చినా కొన్ని రోజుల్లోనే పొదుగు దగ్గర వాపు తగ్గిపోతుందని వివరించారు.

– ఇదిలా ఉండగా.. ఆవుదూడ పుట్టిన ఐదో రోజు నుంచే పాలు ఇస్తుండటంతో ఈ వింతను చూసేందుకు జనం క్యూ కట్టారు. దూడను చూసిన జనం 'పుట్టగానే ఆవు దూడలు పాలు ఇస్తాయని' బ్రహ్మంగారు చెప్పిన కాలజ్ఞానం నిజమైందంటూ చర్చించుకుంటున్నారు.

'పదవీ విరమణ వయసుకే.. వృత్తికి కాదు'

మాగనూర్ (కృష్ణ): ప్రతి ఉద్యోగి వృద్ధాప్యంలో పదవీ విరమణ చేయడం సర్వ సాధారణమని పోస్టల్ అధికారి మహేష్ అన్నారు. మాగనూర్ మండల పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహించిన లక్ష్మీదేవమ్మ గురువారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి కార్యాలయంలో ఆమెకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసి లక్ష్మీదేవమ్మ దంపతులకు ఘనంగా సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ పదవీ విరమణ వయసుకే కానీ వృత్తికి కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో హనుమంతరాయ, తిప్పన్న, సురేష్, భాని చందర్, సీతారామరావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమరచింత: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుల కోసం నైపుణ్యం గల చేనేత కార్మికులు దరఖాస్తు చేసుకోవాలని చేనేత, జౌళిశాఖ ఏడీ గోవిందయ్య గురువారం కోరారు. 2024 డిసెంబర్ నాటికి 30 ఏళ్లు నిండి పదేళ్లకు తగ్గకుండా అనుభవం ఉన్నవారు.. డిజైనింగ్ కేటగిరీలో 31.12.2024 నాటికి 25 ఏళ్లు నిండి ఐదేళ్ల అనుభవం ఉన్న వారు అర్హులన్నారు.

పలువురిపై కేసు నమోదు

నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలో గురువారం ఏఎస్ఐ అంజనేయులు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని అలా నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి మళ్లీ పట్టుబడితే వాహనం సీజ్ చేసి సదరు వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

చోరీ కేసులో ఇద్దరి రిమాండ్

గోపాల్‌పేట: చోరీ కేసులో ఇద్దరు యువకులను రిమాండ్‌కు తరలించామని గోపాల్‌పేట ప్రొహిబిషన్ ఎస్ఐ నరేష్ తెలిపారు. గురువారం ప్రొహిబిషన్ ఎస్ఐ నరేష్ గోపాల్‌పేటలోని కోదండరామ స్వామి ఆలయ ప్రాంతంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా బుద్దారంలో బుధవారం అర్జునయ్య ఇంట్లో తామే దొంగతనం చేశామని ఒప్పుకున్నారు. వారి నుంచి దొంగిలించిన సొమ్మును జప్తు చేసి నిందితులు బింగి శ్రీకాంత్, మండ్ల నరేష్‌ను రిమాండ్‌కు తరలించామని వివరించారు.

దేశం గర్వించే స్థాయికి ఎదగాలి: కలెక్టర్



ఆత్మకూర్: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 577 మార్కులు సాధించి ఉమ్మడి ఆత్మకూర్ మండల టాపర్‌గా నిలిచిన శ్రీవాణి విద్యార్థిని పూజను, 559 మార్కులు సాధించిన తిప్పడంపల్లి విద్యార్థి నిఖిల్‌ను జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అభినందించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను పూలమాల, షాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ బాగా చదివి దేశం గర్వించే స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ కొండాపురం బాలరాజు, శ్రీవాణి హైస్కూల్ డైరెక్టర్ టీజే విశ్వేశ్వర్, జీహెచ్ఎంలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్వర్టును ఢీకొట్టిన ఆటో: ఇద్దరికి గాయాలు

ఎర్రవల్లి: ప్రమాదవశాత్తు ఆటో అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని కొండేరుకు చెందిన బోయ రాముడు తన ఆటోలో అదే గ్రామానికి చెందిన ముష్టి బీచుపల్లితో పాటు మరో ముగ్గురు ప్రయాణికులతో కలిసి గద్వాల నుంచి ఎర్రవల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో గద్వాల–ఎర్రవల్లి రహదారిపై నంది గోశాల సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి రోడ్డు పక్కన కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బోయరాముడు, ముష్టి బీచుపల్లికి తీవ్ర రక్త గాయాలు కాగా.. మరో ముగ్గురు ప్రయాణికులు తేలికపాటి గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు.

బాలల చట్టాలపై అవగాహన



కోటకొండలో మాట్లాడుతున్న మాజీ సర్పంచ్ విజయలక్ష్మి

నారాయణపేట రూరల్: బాలల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మాజీ సర్పంచ్ విజయలక్ష్మి తెలిపారు. కోటకొండ గ్రామపంచాయతీ కార్యాలయంలో జిల్లా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 14 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకోవడం నేరమన్నారు. 18 ఏళ్లలోపు ఆడ పిల్లలకు 21 సంవత్సరాలలోపు మగ పిల్లలకు వివాహాలు చేయకూడదని సూచించారు. గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు. అలాగే ఆపదలో ఉన్న బాలలను రక్షించడానికి 1098 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంటుందని, పిల్లలకు సంబంధించి ఎలాంటి సాయం కావాలన్నా ఈ నంబర్‌కు ఫోన్ చేస్తే అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. కార్యక్రమంలో సంక్షేమ శాఖ సిబ్బంది లక్ష్మణ్ నాయక్, శ్రావణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి చాణిక్య రెడ్డి, అంగన్వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, యువజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేత



ఎంపీడీవోకు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

మాగనూర్: దేశవ్యాప్తంగా మే 20న చేపట్టనున్న జాతీయ సమ్మెలో మాగనూర్ గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొనబోతున్నట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ అంజనేయులు, గ్రామ పంచాయతీ యూనియన్ నాయకులు తెలిపారు. ఈ మేరకు మాగనూర్ ఎంపీడీవో రహ్మతుద్దీన్‌కు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. అనేక త్యాగాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను సవరించి, యజమానులకు అనుకూలంగా 4 లేబర్ కోడ్‌లు తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా మే 20న సమ్మె చేపట్టనున్నట్లు తెలిపారు. కార్మిక కోడ్‌లు అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు కష్టతరమవుతుందన్నారు. సమ్మెలో పెద్ద సంఖ్యలో గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

భారత సైన్యానికి మద్దతుగా కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ శ్రేణులు

నారాయణపేట: పాకిస్తాన్‌లోని ఉగ్రవాదుల స్థావరాలపై భారత సైన్యం నిర్వహించిన 'ఆపరేషన్ సింధూర్'కు సంఘీభావంగా పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం సీవీఆర్ భవన్ నుంచి మహాత్మా గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఉగ్రవాదులు జరిగిన కాల్పుల్లో అసువులు బాసిన భారత పౌరులకు మౌనం పాటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు ఎండి సలీ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్ మాట్లాడుతూ పహాల్గమ్ ఉగ్రదాడులకు ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ దేశ భద్రతకు నిదర్శనమన్నారు. సైన్యం నిర్వహించిన దాడులు దేశం గర్వపడేలా చేశాయన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ సరాఫ్ నాగరాజు, ఆర్టీఓ బోర్డు సభ్యులు పోషల్ రాజేశ్, నాయకులు వినద్, సూర్యకాంత్, మారుతీ, కార్తీక్, మనోజ్, మసి పవన్, వినోద్, బండి ఆనంద్, మాజీద్ పాషా, హసనుద్దీన్, చాకలి మోహన్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి



మాట్లాడుతున్న బాలనర్సింహ

ఆత్మకూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యుడు బాలనర్సింహ కోరారు. స్థానిక వర్తకసంఘం భవనంలో గురువారం సీపీఐ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులను అంతమొందించేందుకు కేంద్రం తీసుకుంటున్న చర్యలను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలో మూడో సారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెంచడంతో సామాన్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి విజయరాములు, ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి సురేష్, నాయకులు మోష, చంద్రయ్య, శ్రీహరి, అబ్రహం, సీఎన్‌శెట్టి, రమేష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కళాకారులకు ఆదరణేది?

- కుటుంబ పోషణ భారమై వీధిన పడిన వైనం
- పట్టించుకోని ప్రభుత్వం
- ఆందోళనలో 250 మంది కళాకారులు



నాటక ప్రదర్శన చేస్తున్న పెద్దదగడ కళాకారులు

చిన్నంబావి: ఒకప్పుడు రాష్ట్రంలో కళాకారులకు ప్రత్యేక గుర్తింపు ఉండేది. ప్రస్తుతం ఆధునిక పోకడలకు ప్రాచీన కళలు అంతరించిపోతున్నాయి. ప్రభుత్వాలు కూడా సరైన ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో కళాకారులు వీధిన పడుతున్నారు.

కళాకారులపై నిర్లక్ష్యం

మండలంలోని పెద్దదగడలో 30మందికి పైగా సీనియర్ నాటక, కొప్పునూరులో 15మంది పౌరాణిక కళాకారులు ఉన్నారు. వివిధ గ్రామాల్లో కలిపి 120మంది యక్షగాన కళాకారులు ఉండగా.. కొప్పునూరులోనే 110మంది ఉన్నారు. మండలంలో మొత్తం సుమారు 250మంది కళాకారులు తమ కళలతో సాంస్కృతిక, ఆధ్యాత్మిక, పౌరాణిక గాథలకు జీవం పోశారు. కానీ సినీరంగంపై ప్రభుత్వాలు చూపుతున్న శ్రద్ధ సంప్రదాయ కళాకారులపై చూపకపోవడంతో వారి జీవితాలు ప్రశ్నార్థకంగా మారాయి.

తగ్గుతున్న ఆదరణ

ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, టీవీల కారణంగా సినిమాలు, సీరియల్స్ తదితర వాటికి అలవాటు పడ్డ ప్రజలు వీధి నాటకాలపై ఆసక్తి చూపడం లేదు. దీంతో కళలకు ఆదరణ తగ్గిపోవడంతో గతంలో వాటినే ఆసరాగా చేసుకొని జీవనం నెట్టుకొచ్చిన కళాకారులు నేడు దైన్యస్థితిని అనుభవిస్తున్నారు. ఏదైనా ప్రత్యేక కార్యక్రమాలు, పండుగల వేళ సాంస్కృతిక కళల గురించి, కళాకారులకు సన్మానం తదితర కార్యక్రమాలను ఆర్భాటంగా జరిపే ప్రభుత్వాలు మరుసటి రోజు నుంచే కళాకారులను చిన్న చూపు చూస్తున్నాయని వారు వాపోతున్నారు.



పెబ్బేరులో నాటక ప్రదర్శన చేస్తున్న కళాకారులు

సొంత ఖర్చులతో..



ప్రాచీన కాలం నుంచి వస్తున్న ఇతిహాసాలు, రామాయణం, మహభారతం వంటి వంటిపై ఆసక్తి ఉండటంతో పౌరాణిక నాటక ప్రదర్శనను నేర్చుకున్నా. ఇప్పుడు వాటికి ఆదరణ తగ్గడంతో దాతల సహకారం, కొంత మేము సొంత ఖర్చు పెట్టి ప్రదర్శనలు చేస్తున్నాం.

– శంకర్‌యాదవ్

ప్రోత్సాహం లేదు



ఆధునిక యుగంలో నాటక ప్రదర్శనకు ఆదరణ తగ్గింది. గ్రామాల్లోని దాతల సహకారంతో నేటికీ ప్రదర్శనలు ఇస్తున్నాం. ప్రభుత్వం ప్రోత్సహిస్తే నాటక రంగాన్ని బతికించుకోవడానికి కష్టపడతాం.

– చనమోని గంగయ్య, పౌరాణిక నాటక కళాకారుడు

పింఛన్ ఇవ్వాలి



నాటకరంగం మీద ఆధారపడి బతుకుతున్నాం. కానీ కళలు ఆదరణ తగ్గడంతో పూట గడవడం కష్టంగా మారింది. ప్రభుత్వం స్పందించి 50 ఏళ్ల వయస్సు నిండిన కళాకారులను గుర్తించి రూ.3వేలు ఫింఛన్ అందించాలి.

– పూజారి బాలస్వామి, పెద్దదగడ